క్లుప్తంగా

నేటి నుంచి ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



పంచముఖి ఆంజనేయ స్వామి

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లిలోని పంచముఖి ఆంజనేయ స్వామి దేవస్థానం 14వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్తలు కర్పూరం నాగరాజు, ఆంజనేయ గుప్త తెలిపారు. శనివారం సింధూర సహిత లక్ష తమలపాకుల పూజ, స్వామివారికి శాంతి కల్యాణం, 12న స్వామి వారి గ్రామోత్సవం, 13న అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆధార్ నమోదు సెంటర్ పరిశీలన



కోండ్రుకోటలో ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని కోండ్రుకోట, ఎల్ఎన్‌డీ పేట సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు సెంటర్లను ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు శుక్రవారం పరిశీలించారు. ఎంతమందికి ఆధార్ నమోదు చేస్తున్నారు, వచ్చిన వారికి సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆధార్ నమోదుతో పాటు ఆధార్ అప్‌డేట్ పనులు పూర్తిచేయాలని సూచించారు. అనంతరం కోండ్రుకోట పీహెచ్‌సీ పరిధిలోని బుట్టాయగూడెంలో మండలంలోని పల్లపూరులో సబ్‌సెంటర్‌ను పరిశీలించినట్లు ఎంపీడీవో తెలిపారు. సబ్‌సెంటర్‌లో రోగులకు అందుతున్న సేవలపై వైద్యాధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనారోగ్యం



బొర్రంపాలెం హైస్కూల్లో మాట్లాడుతున్న ఎస్సై సతీష్‌కుమార్

టి.నరసాపురం: మండలంలోని పాఠశాలల వద్ద ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌లను అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. బొర్రంపాలెం హైస్కూల్ వద్ద విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే ప్రమాదాలను విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఎస్సైతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



కంగాలవారిగూడెంలో సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

బుట్టాయగూడెం: మండలంలోని కంగాలవారిగూడెంలో ఘనంగా సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, పంచగవ్యప్రాశన, మండపారాధన, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, మండపార్చన, హోమాలు, గోపూజ, విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, మంగళహారతి, ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు కాళ్ల సూరిబాబు, రేపాకుల చంద్రం పాల్గొన్నారు.

13న అవగాహన సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని వివిధ ఆర్టీసీ బస్టాండుల్లో వ్యాపారాభివృద్ధి చేసుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ నెల 13న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల వ్యాప్తంగా ఏలూరు కొత్త బస్టాండు, ఏలూరు పాత బస్టాండు, భీమవరం, పాలకొల్లు బస్టాండుల్లో వాణిజ్య సముదాయం పెంపొందించే మార్గంలో అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడానికి ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరులోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ అవగాన సదస్సు ప్రారంభమౌతుందన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు పథకాలు దోహదం



చింతలపూడి చేయూత మహిళా మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా దంపతులు

చింతలపూడి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే సదుద్దేశ్యంతో పొదుపు సంఘాల ఆధ్వర్యంలో చేయూత మహిళా మార్ట్‌లను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. స్థానిక ఐకేపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. మహిళా మార్ట్ ప్రమోషన్‌లో భాగంగా సతీమణి ఝాన్సీరాణితో కలిసి షాపింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి అనేక విప్లవాత్మక పథకాలు తీసుకువచ్చారని తెలిపారు. అందులో భాగంగా మహిళల భాగస్వామ్యంతో మహిళా మార్ట్‌లు ప్రారంభించారన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు పథకాలు దోహదం చేస్తాయని అన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఎంపీపీ డా బి రాంబాబు నాయక్ పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జ్యోతి, వైసీపీ మహిళా నేతలు ఎస్ వరలక్ష్మి, వై కుమారి, మారుమూడి కుమారి, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయితీ సచివాలయాల కన్వీనర్ ఎస్ దుర్గారావు, యడ్ల మోహన్‌రావు, ఎస్ కాంతారావు, వైసీపీ నాయకులు ఎం ఇమ్మానియేలు, మిరియాల దిలీప్, కొప్పుల నాగేశ్వరరావు, ఎ సుబ్బారావు, వెంపా కృష్ణ పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు

జంగారెడ్డిగూడెం: ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం ఇవ్వలేని గౌరవం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇస్తోందని జంగారెడ్డిగూడెం పట్టణ, మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి దేవాదాయ శాఖ పరిధిలో 610 దేవాలయాల్లో ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా నాయీ బ్రాహ్మణులు నియమించాలని జీవో ఇవ్వడం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షుడు చిప్పాడ నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు మలవరపు నాగపోసి, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అదానీ ఆస్తులు కేంద్ర ప్రభుత్వం జప్తు చేయాలి



బుట్టాయగూడెం రోడ్డులోని ఎస్‌బీఐ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

జంగారెడ్డిగూడెం: అవినీతి, అక్రమ సంపాదనతో దేశంలో అగ్రగామి వ్యాపార వేత్తగా ఎదిగిన గౌతమ్ అదానీ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం జప్తు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జె.వి.రమణ రాజు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక బుట్టాయగూడెం రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద శుక్రవారం అదాని ఆస్తులు జప్తు చేయాలని, డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అదానీ ఆస్తులు కేంద్ర ప్రభుత్వం జప్తు చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసిన మోదీ ప్రభుత్వం గద్దె దిగాలని నినాదాలు చేశారు. అనంతరం కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఐ మండల కార్యదర్శి జె.వి.రమణ రాజు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును కేంద్రమే పూర్తి చేయాలని రమణ రాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కౌన్సిల్ సభ్యులు చిలపరెడ్డి వెంకటరెడ్డి, చాకిరి సురేష్, ఎర్రగొర్ల సూర్యచంద్రం, జగన్నాథ లక్ష్మణరావు, చిలంతరాజుల శ్రీను, కె.విఘ్నేష్, ఇసుకపాటి గాంధీ, ద్రాక్షారపు రామబ్రహ్మం, కట్టా శ్రీనయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ద్వారకాతిరుమల: అప్పుల బాధ తాళలేక కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం. మండలంలోని ఎం.నాగులపల్లికి చెందిన వసంతాటి సుబ్రహ్మణ్యం (28), హరిత దంపతులకు ఒక పాప, బాబు సంతానం. ఇదిలా ఉంటే 2022లో తన 8 సెంట్ల స్థలంలో రూ. 6 లక్షలు అప్పుచేసి ఇంటిని నిర్మించాడు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో చెల్లించాల్సిన వాయిదాలను చెల్లించలేక పోయాడు. దాంతో తీవ్ర మన స్థాపానికి గురైన సుబ్రహ్మణ్యం ఈనెల 6న సాయంత్రం కలుపు మందు తాగాడు. విషయాన్ని తన అక్క మీనాక్షికి తెలియజేయగా, ఆమె గ్రామానికి చెందిన సందీప్ ద్వారా అపస్మారక స్థితిలో ఉన్న సుబ్రహ్మణ్యంను భీమడోలులోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య హరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చురుగ్గా మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు



పట్టిసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ వి.సుమతి

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు పట్టిసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. ఆమె పట్టిసంలో ఉత్సవ పనులను శుక్రవారం పరిశీలించారు. భక్తులు కాలినడకన పంట్లు ఎక్కే మార్గంలో ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించారు. మూడు పంట్లు వచ్చాయని, వాటితో ఫ్లాట్‌ఫారం, జెట్టీలు కడుతున్నారని తెలిపారు. ఇసుక తిన్నెలపై నీడకు షామియానాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మంచినీటి వసతి కోసం ఇసుక తిన్నెలపై చేతి పంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శివక్షేత్రం వద్ద ఫ్లాట్‌ఫారం పనులు వేగవంతం చేసినట్టు తెలిపారు.

వింజరం పీహెచ్‌సీ పరిశీలన

పోలవరం మండలం వింజరం గ్రామ పీహెచ్‌సీని తహసీల్దార్ బి.సుమతి సందర్శించి రికార్డులను పరిశీలించారు. అన్ని రకాల మందులు ఉన్నాయా లేదా అనే విషయాలను వైద్యాధికారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీకి ఎంతమంది పేషెంట్లు హాజరవుతున్నారన్న విషయంపై ఆరా తీశారు. డీటీ కాజా రమేష్ తదితరులు ఉన్నారు.

నూకాలమ్మ ఆలయానికి రూ. 10,116 విరాళం



దాతలను సత్కరిస్తున్న నూకాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, రామలక్ష్మి దంపతుల సారథ్యంలో అర్చకులు ఆలయ కల్యాణ కళావేదిక వద్ద ఉత్సవ మూర్తికి పంచామృతాలతో అభిషేకం, పూజలు నిర్వహించారు. డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి రెడ్డి వెంకటనాగదుర్గా వరప్రసాద్, కుసుమ శాంత నాగకుమారి దంపతులు రూ. 10,116 విరాళంగా అందజేసినట్లు తెలిపారు. అల్లు వెంకటలోవరాజు, గాయత్రిదేవి దంపతులు అమ్మవారి పుష్పాలంకరణకు సహకారం అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో అమ్మ వారి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని ఇచ్చి వేద ఆశీర్వాదంతో ఘనంగా సత్కరించారు. శ్రీనూకాంబిక సేవ బృందం సభ్యులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. సరిపల్లికి చెందిన బాలిక జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం ఉదయం కళాశాలకు వెళ్లిన బాలిక ఇంటికి తిరిగి రాలేదని తండ్రి తెలిపాడు. సరిపల్లికి చెందిన యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.సాగర్ బాబు తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకుంటేనే ఉన్నత స్థానం



సీఎస్‌టీఎస్ ప్రభుత్వ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని సీఎస్‌టీఎస్ గవర్నమెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అన్నారు. స్థానిక కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం ప్రిన్సిపాల్ శుక్రవారం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్ బాబు మాట్లాడుతూ కళాశాలలో ఎన్నో సదవకాశాలున్నాయని, విద్యతో పాటు మానసిక వికాసం అభివృద్ధి చేయడానికి అనేక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. వృత్తి విద్యా కోర్సుల్లోనూ ట్రైనింగ్ ఇస్తున్నామన్నారు. కళాశాల ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్. కె.సత్యరాజేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడంలో మొదటి గురువులని తర్వాత స్థానం ఉపాధ్యాయులదని అన్నారు. కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జ్ డాక్టర్. కె.ఉత్తమ్‌సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ నుంచి తమ భవిష్యత్తు మొదలవుతుందని, అవకాశాలన్నీ సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ రమాదేవి, కెవీవీ శిరీష, బీసీ హాస్టల్ వార్డెన్ శిరీష గారు, ఎస్టీ హాస్టల్ వార్డెన్ పద్మజ, ఎస్సీ హాస్టల్ వార్డెన్ కరుణ కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని త్రీటౌన్ పరిధిలో వాహనదారులు సరైన ధృవపత్రాలను కలిగి ఉండాలనీ, రోడ్లపై ఇష్టారాజ్యంగా తిరిగితే సహించేదిలేదని ఏలూరు త్రీటౌన్ సీఐ కేవీఎస్ వరప్రసాద్ తెలిపారు. ఏలూరు నగరంలో ఫైర్‌స్టేషన్ సెంటర్, ఇతర ప్రాంతాల్లో సరైన ధృవపత్రాలు లేని వాహనదారులకు చలానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగరంలో వాహనదారులు రోడ్లపైకి వస్తే సరైన పత్రాలు కలిగి ఉండాలనీ, రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో హెల్మెట్ ధరించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. యువత ముఖ్యంగా మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారనీ, వారి తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



కామవరపుకోట ప్రభుత్వ కళాశాలలో మాట్లాడుతున్న అధ్యాపకులు

కామవరపుకోట: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని కామవరపుకోట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. కళాశాలలో డిగ్రీ చదివే సీనియర్ విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం (2022–23)లో డిగ్రీలో చేరిన జూనియర్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఘనంగా ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులంతా కలిసిమెలిసి ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆడమిల్లి సర్పంచ్ జి.కేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్, డి.మల్లేష్, వి.శ్రీనివాస్, ఎ.హర్షవర్ధిని, నజ్మా, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ఇత్తడి తాపడం పనులకు విరాళం



కొయ్యలగూడెంలో ధ్వజస్తంభం ఇత్తడి తాపడం పనులకు బిందెలు సమర్పిస్తున్న చిన్నారులు

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా భక్తుల నుంచి ఇత్తడి సేకరణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. సుమారు రూ.1.50 లక్షల వ్యయంతో స్వామి వారి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ నేపథ్యంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న ధ్వజస్తంభ ఇత్తడి తాపడానికి గ్రామంలో చిన్నారులు, పెద్దలు పెద్ద ఎత్తున ఇళ్లలోని ఇత్తడి సామగ్రిని అందజేస్తున్నారు. సుమారు 300 కేజీలతో ఇత్తడి తాపడం పనులు ప్రారంభిస్తున్నామని పాలక మండలి కమిటీ చైర్మన్ మద్దు గోపి పేర్కొన్నారు. ఇత్తడి పాత్రలను అందజేసే వారు నేరుగా ఆలయం వద్ద పురోహితులు శేషాచార్యులకు లేదా కమిటీ సభ్యులకు అందజేయాల్సిందిగా సూచించారు. ఈనెల 27 నుంచి మార్చి 6 వరకు ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నారు.

వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



చింతలపూడి ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్

చింతలపూడి: జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ చింతలపూడి ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని శుక్రవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత నిస్తూ నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

టి.నరసాపురం: మండలంలోని కె.జగ్గవరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం లభించిన ప్రదేశంలోనే ఆలయాన్ని నిర్మించారు. మండల వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ సర్పంచ్ వెలిది నాగబాబు, ప్రసన్న లక్ష్మీ దంపతుల చేతుల మీదుగా శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. మూడు రోజులు నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో విజయవాడ రైల్వేబోర్డు మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకులు వంటిపల్లి సుబ్రహ్మణ్యం, పిన్నమనేని రాధాకృష్ణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు అద్దంకి మనోజ్ కుమార్, రైతు ప్రతినిధి వెలిది గంగాధరరావు పాల్గొన్నారు.

రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్రం

కొయ్యలగూడెం: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించకపోవడంలోనూ వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని సీపీఐ మండల పార్టీ కన్వీనర్ జమ్మి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఎస్‌బీఐ శాఖ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అవినీతితో కూరుకుపోయి ఆదాని కంపెనీలకు ప్రభుత్వ భూములు దోచిపెడుతోందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించడంలో కేంద్రం బడ్జెట్లో ప్రస్తావించకపోవడం అన్యాయమన్నారు. విశాఖ రైల్వే జోన్ కల్పించకపోవడం రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని, విశాఖ రైల్వే జోన్ ప్రకటించాలని నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. తాడిగడప ఆంజనేయరాజు, వెలగల రామారావు, డి సోమరాజు, ఎస్కే బాజీ, ఎస్.గిరి, మట్ట రామకృష్ణ, ఎస్.రాంబాబు, ఎస్.గోపాలం, డి.నారాయణరావు, జక్కు కోవాడయ్య, గుదే శ్రీను పాల్గొన్నారు.

కేంద్రం బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన

కుక్కునూరు: నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ, ఆదాని,అంబానీల ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండల పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కుక్కునూరు యూనియన్ బ్యాంక్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నాలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్, సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, వర్సా పాపారావు, వర్సా నాగేశ్వరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలపై హర్షం

ఏలూరు (టూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న కానుకగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఆసరాగా వారి పిల్లల పెళ్ళిళ్లకు వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల్లో ఆర్థిక సాయం విడుదల చేయడం పట్ల జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా స్థానిక వన్‌టౌన్ నందలి సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో బీసీల తరుపున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తమ కుమార్తెకు పెళ్లి చేయాలంటే ఎంతో వ్యయ,ప్రయాలతో ఎదుర్కోవలసి వస్తోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న మధ్య తరగతి, పేద కుటుంబాలకు పెద్ద కొడుకుగా, అన్నగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను తీసుకు వచ్చి పెళ్లి కానుక అందించడం గొప్ప విషయమన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేసిన ఈ పథకాల్లో భాగంగా ఏలూరు నగరంలోని 18 మందికి పెళ్లయిన కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు బీసీల తరుపున ఆయన కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు అప్పిరెడ్డి రంగ ముత్యాలు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, ఎదలాడ నాని, బాయి వెంకట్రావు, కొండల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

కొయ్యలగూడెం: బాలిక వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్న ఆకతాయిపై చర్యలు తీసుకోవాలంటూ గవరవరం, చొప్పరామన్నగూడెం గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. శుక్రవారం కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ ఎదురుగా 100 మందికి పైగా గ్రామస్తులు తమ నిరసన వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం మండలం కృష్ణంపాలెంకు చెందిన ఎంటీ విష్ణు కొద్ది కాలంగా చొప్పరామన్నగూడెంకు చెందిన హైస్కూల్ విద్యార్థిని వెంట పడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. బాలిక తన కుటుంబీకులకు విషయం తెలపగా ఆమె సోదరుడు ఆకతాయిని గవరవరం జెడ్పీ హైస్కూల్ వద్ద నిలదీశాడు. ఆ సమయంలో విష్ణు అతని అనుచరులు బాలిక సోదరుడు, తండ్రిపై దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ నేపథ్యంలో యువకుడితోపాటు అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన నిర్వహించారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్సై జీజే విష్ణువర్ధన్ పేర్కొన్నారు.

నేటి నుంచి జాగృతి ఉద్యమం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రముఖ, సామాజిక ఆధ్యాత్మిక సంస్థ అయిన జమా అతె ఇస్లామి హింద్ (జెఐహెచ్) ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మానవత నైతికత అనే నినాదంతో జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఏలూరు నగర అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ తెలిపారు. ఉన్నత లక్ష్యంతోనే జమా అతె ఇస్లామి హింద్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఈ మానవత – నైతికత జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమంలో భాగంగా సామాజిక, రాజకీయ వివిధ ప్రత్యేక రంగాలకు సంబంధించిన ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశాలు, వివిధ మతాల ఆధ్యాత్మిక గురువులతో చర్చాగోష్టిలు, వ్యక్తిగత పరిచయాలు, కరపత్రాలు పోస్టర్ల పంపిణీ, సోషల్ మీడియా ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

13న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రహదారుల దిగ్బంధం

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణ సాధనకై బీజేపీ నమ్మక ద్రోహాన్ని నిరసిస్తూ ఈ నెల 13న జాతీయ రహదారుల దిగ్బంధాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పలివెల చంటి కోరారు. షెడ్యూల్డ్ కులాల ఏ,బీ,సీ,డీ వర్గీకరణ సాధనకై జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తీసుకున్న నిర్ణయం మేరకు ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ 13న నిర్వహించే జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.